# స్త్రీకి స్త్రీ శత్రువు కాదు!

భయపడుతూనే ఆ పార్టీకి వెళ్లింది. ఆ బర్త్‌డే పార్టీకి జాన్సన్ తప్పకుండా వస్తాడని అనుకుంది. కానీ ఒక్కడే వస్తాడా? భార్య రోజీని కూడా తీసుకుని వస్తాడా? అనే సందేహం కలిగి ఆలోచిస్తూ వుండిపోయింది. రోజీ ఆ పార్టీకి వస్తే తప్పకుండా తనతో గొడవ పడుతుంది. తన పరువు పోగొడుతుంది.

సరే ప్రస్తుతం తను ఎదుర్కొంటున్న పరిస్థితులను దృష్టిలో వుంచుకుని అన్నిటికీ తెగించి జాన్సన్‌ని కలవాలని ఆ పార్టీకి వెళ్లింది. ఈ విషమ పరిస్థితుల్లో జాన్సన్ సాయాన్ని ఆశించక తప్పదు మరి.

ప్రిస్కిల్లా ఇల్లంతా సందడిగా వుంది. ఇంటి ముందున్న ఖాళీ స్థలంలో చాలా రకాల మోటారు వాహనాలు ఆగివున్నాయి. ముఖద్వారం దగ్గర నిలబడి వుంది ప్రిస్కిల్లా అతిథులకు స్వాగతం పలుకుతూ ఆమె తన స్నేహితురాలు. ఆరోజు ఆమె భర్త జోసెఫ్ పుట్టినరోజు.

"హాయ్ మేరీ" అంటూ కరచాలనం చేసింది ప్రిస్కిల్లా తనకు దగ్గరగా వచ్చి.

"జాన్సన్ వచ్చాడా?" గుసగుసలాడుతున్నట్టుగా అడిగింది తను.

ప్రిస్కల్లా చిన్నగా నవ్వి "జాన్ రాలేదు గానీ రోజీ వచ్చింది. పైకి వెళ్ళకు. తను పైన కూర్చుంది. నువ్వు కిందనే వుండు. ఇంకొంచెంసేపట్లో నేనొస్తాను" అంది.

స్నేహితురాలికి థాంక్స్ చెప్పి లోపలకు వెళ్లి కుర్చీలో కూర్చుంది. కొంతమంది తెలిసినవాళ్లు కనిపించారు గానీ తనే చూసి కూడా చూడనట్టు నటించింది. ఎవరైనా తన గురించి అడిగితే యేం చెబుతుంది? నలుగురితో చెప్పుకునే విషయమా?

రోజీ మేడమీద వుందని తెలిసినా భయంగానే వుంది. ఒకవేళ రోజీ కిందకు దిగివస్తే తన గతేం కాను? తనని రోజీ బారినించి ఎవరు కాపాడగలరు? రోజీ గురించి తనకు బాగా తెలుసు. ఆదపులి తను దేవుడని ప్రార్థించక తప్పదు.

ఇంటినంతా రంగురంగుల కాగితాలతో అలంకరించారు. ఇల్లంతా రకరకాల లైట్లతో వెలిగిపోతోంది.

చాలామంది అతిథులు వచ్చారు. అంతా ఉత్సాహంగా నవ్వుతూ

తిరిగుతున్నారు. ఆ పార్టీకి రోజీ రాకుండా వున్నట్లయితే తను కూడా కొంచెం ఉల్లాసంగా వుండగలిగేది. కానీ ఇప్పుడు రోజీ తన పాలిట సింహ స్వప్నమయింది. ఇంతకీ జాన్సన్, ప్రిస్కిల్లా భర్త జోసెఫూ మంచి స్నేహితులు. ఆరోగ్యం బాగాలేక రాలేదేమో అనే ఆలోచన కలిగింది. అలా అయివుండదు. అలా అయితే ప్రిస్కిల్లా తనతో చెప్పేది.

"భయపడకు మేరీ. నిన్ను నేను కాచుకుంటాను. పార్టీ అయిపోయేవరకు వుండు. భోజనం చేశాకనే నిన్ను కదలనిస్తాను" అన్నది ప్రిస్కిల్లా అధికారం ధ్వనిస్తున్న గొంతుతో.... ప్రిస్కిల్లా గొంతులో, మాటల్లో అధికారమే కాదు ఆప్యాయత కూడా వుంది.

"ప్రిస్కీ... నువ్వు నన్ను ద్వేషించటం లేదా?" ఆశ్చర్యపడుతూనే అడిగింది తను.

ప్రిస్కీ గొప్ప వేదాంతిలా నవ్వి "స్నేహం విలువ నాకు తెలుసు మేరీ.... ఈరోజు జరిగిన ఒక తప్పుకు కొన్నేళ్ల స్నేహాన్ని బలిచేసే మూర్ఖురాలిని కాదు" అన్నది.

తన కళ్లలో గిర్రున నీళ్లు తిరిగాయి. నిజానికి తను చేసిన పనికి ఎవరయినా ద్వేషిస్తారు. కానీ ప్రిస్కిల్లా?

ఇంతలో ప్రిస్కిల్లా భర్త జోసెఫ్ మేడమీదనించి వచ్చాడు. ఆయన రావడంతోనే అంతా ఒక్కసారిగా అరిచారు. బహుశా అది బర్త్‌డే విషెస్ చెప్పే లక్షణం అయివుంటుంది.

భర్త రాకతో ప్రిస్కిల్లా తన దగ్గర్నించి వెళ్లిపోయింది.

తన ఆలోచనలు మళ్లీ మొదలు. రోజీని ఎలా ఎదుర్కోవాలి? తను తప్పు చేసింది. అప్పట్లో తన తప్పు తెలీదు గానీ ఇప్పుడు భయపడుతోంది.

ఈమధ్య దురదృష్టకరమయిన విషయం ఒకటి జరిగింది. రోజీ భర్త జాన్సన్‌కి తనకీ మధ్య సంబంధం ఏర్పడింది. వివాహిత సంబంధాన్ని లోకం హర్షించదు కదా. ఇప్పుడు కూడా అదే జరుగుతోంది. ఈ సంబంధం గురించి రోజీకి తెలిసింది. తన భర్త ఫ్రాన్సిస్‌కు కూడా తెలిసి తనని కొట్టి ఇద్దరు పిల్లల్నీ వదిలి వేరే వెళ్లిపోయాడు. తను ఒంటరి అయ్యింది. ఆర్థికంగా ఎన్నో అగచాట్లు పడుతోంది. జోసెఫ్ భయపడినట్టున్నాడు. తరువాత తనని కలవలేదు.

ప్రిస్కిల్లా ఫోన్‌చేసి తన భర్త బర్త్‌డే పార్టీకి రమ్మని ఆహ్వానించినప్పుడు ఆ

పార్టీలో జాన్సన్‌ని కలిసి అతడి సాయాన్ని కోరవచ్చుననే ఆశ కలిగింది తనకు. కానీ తన ఆశను నీరుగరుస్తూ జాన్సన్ రాలేదు. రోజీ వచ్చింది. తనతో గొడవపడాలనే వచ్చి వుంటుంది.

భగవంతుడా.... రోజీ నించి రక్షించు. పరువుపోకుండా చూడు.

తన ప్రార్థనకు తనకు నవ్వొచ్చింది. ఆ పరిస్థితుల్లో కూడా తప్పు చేసిన మనిషి అందుకు తగిన శిక్షను అనుభవించటానికి సిద్ధపడాలనే తత్వం తనది. అలాంటిది ఇప్పుడు దేవుణ్ని ప్రార్థిస్తోంది. శిక్ష నుంచి కాపాడమని మనిషి నైజం ఇంతేనేమో తన వరకూ వస్తే అన్ని తత్వాలూ గాల్లో కలుస్తాయి.

అయిపోయింది. తను భయపడినంతా జరగబోతోంది. రోజీ చిన్నగా మెట్లు దిగి వస్తోంది. తన చుట్టూ ఎవరూ లేరు.

తను జీవంలేని చూపు చూస్తోంది. ఉరిశిక్ష పడిన నేరస్థుడిలా వుంది తన పరిస్థితి.

గబగబా బయటకు వెళితే కుదరదు. రోజీ తనని చూసింది. అందరినీ తప్పుకొని తన దగ్గరకే వస్తోంది.

తన పని ఖాళీ. ఇవాల్టితో తన పరువు గంగలో కలిసిపోతుంది. రోజీ దగ్గరకు వచ్చింది.

తన ఎదురుగా నిలబడి "ఎలా వున్నావ్?" అనడిగింది.

తనకు మాట బయటకు రాలేదు. గొంతు తడిలో ఆరిపోయినట్టుంది.

"ఇక్కడ కాదు. బయటకు వెళ్లి మాట్లాడుకుందాం పద" అన్నది తనే.

ఇదీ కొంత నయమనిపించింది. ఈ గొడవను అంతా వినే అవకాశం వుండదు.

బయటకు వెళ్లాక రోజీ ఒక చెట్టు దగ్గర నిలబడింది. తనూ ఆమెను కొంచెం దూరంలో. రోజీ మొహం సీరియస్‌గా వుంది. తనతో గొడవపడాలనే వచ్చివుంటుంది. సందేహం లేదు.

"ప్లీజ్. ఇప్పుడు నాతో గొడవపడకు. ప్రస్తుతం నానించి నా ఏడుపు తప్పించి మరొక జవాబు రాదు" అన్నది ఎలాగో.... తన గొంతు తనకే చిత్రంగా తోచింది. పక్షవాతం వచ్చిన మనిషిలా మాట్లాడింది.

ఎందుకు నవ్విందో తెలీదు గానీ రోజీ నవ్వి "నువ్వు ఈ పార్టీకి జాన్సన్ కోసమే వచ్చావని తెలుసు. చూశావా జాన్సన్ రాలేదు. జాన్సన్ ఎందుకు రాలేదో

నువ్వు వూహించగలవా?" అనడిగింది రోజీ.

రోజీకి తనమీద కోపం లేదా? ఇలా మాట్లాడుతోంది. తను అనవసరంగా భయపడిందా?

"చెప్పు మేరీ. జాన్సన్ ఈ పార్టీకి ఎందుకు రాలేదు?" అన్నది మళ్లీ.

"తెలీదు రోజీ" చిన్నగా గొణిగింది.

మనసు మూలల్లో ఎక్కడో ఏదో భయం కదులుతూనే వుంది. తుఫాను ముందు ప్రశాంతతా ఇది. తేల్చుకోలేకపోతోంది.

"నువ్వు భర్తకు దూరమై ఒంటరిగా బతుకుతున్నావనీ, ఇద్దరు పిల్లలూ విషజ్వరాలతో ఉన్నారనీ, వాళ్లకు వైద్యం చేయించటానికి డబ్బు లేక నువ్వు బాధపడుతున్నావనీ జాన్సన్‌కు తెలుసు. ఈ పార్టీకి వస్తే నువ్వు అతడి సాయాన్ని అర్థిస్తావనే భయంతో జాన్సన్ ఇక్కడకు రాలేదు మేరీ. తెలుసుకున్నావా జాన్సన్ ఎలాంటి మనిషో? గొప్ప అవకాశవాది. అంతకుమించి పిరికివాడు. చాలామంది అవకాశవాదుల్లో పిరికివాళ్లే ఎక్కువమంది వుంటారు. నిజానికి బాధ్యత తీసుకోనప్పుడు ఏ మనిషీ ఇంకో మనిషిని కోరుకోగూడదు. జాన్సన్ ఎలాంటివాడో నాకు బాగా తెలుసు" అని రోజీ మాట్లాడటం నిలిపేసింది.

తనకు భయమేసింది ఆ మాటలు విన్నాక. ఇప్పుడు తనకేమిటి దారి? జాన్సన్ నించి తనకు ఎలాంటి సాయమూ లభించదు. ఒకవేళ జాన్సన్ ఆ పార్టీకి వచ్చినా తన పని అయ్యేది కాదు. తన కళ్ల ముందు విషజ్వరాలతో బాధపడుతున్న పిల్లలు కనిపించారు. తనకెవరు సాయ్ చేస్తారు?

రోజీ తిరిగి మాట్లాడటం మొదలుపెట్టింది.

"ప్రిస్కిల్లా ఇంకా ఏమన్నదో తెలుసా? ఒక తప్పులో ఇద్దరు భాగస్వాములయినప్పుడు ఒక్కరినే కార్నర్ చెయ్యటం ధర్మం కాదన్నది. ఇవాల్టి తప్పుకు ఎన్నో ఏళ్ళ స్నేహాన్ని బలిపెట్టటం మూర్ఖత్వమన్నది. నిజమే. మన స్నేహంలో గడిపిన ఎన్నో విలువైన క్షణాలను విలువ లేకుండా చెయ్యకూడదు కదా. నిన్ను నేను అర్థం చేసుకోగలను. అనవసరంగా నీకు ఇదంతా చెబుతున్నాను. ప్రిస్కిల్లా నీకు అభయమిచ్చి వుంటుంది. అవును కదూ?"

తల వూపింది అవునన్నట్టు. భయపడకు నేను కాచుకుంటానని ప్రిస్కిల్లా అనటం గుర్తుకొచ్చింది.

"జాన్సన్ రాకపోయినా, ఈ పార్టీకి నేను నీకోసమే వచ్చాను. నీతో

గొడవపడటానికి మాత్రం కాదు" అంది రోజీ.

"ఎందుకు?" వెంటనే అడిగింది తను. అడగాలనిమాత్రం కాదు. ఎందుకో అలా వచ్చేసింది.

"ఎందుకంటే - జాన్సన్ చెయ్యాల్సి ఉండి కూడా చెయ్యని పనిని అతడి భార్యగా నేను చెయ్యాలని"

"అంటే? క్లియర్‌గా చెప్పు"

రోజీ మాట్లాడకుండా హాండ్‌బ్యాగ్‌ను తెరిచింది. తను ఆశ్చర్యంతో చూస్తోంది.

రోజీ బ్యాగ్‌లోనించి కొన్ని వందల రూపాయలనోట్లు తీసి తనకిస్తూ "తీసుకో మేరీ. ఈ డబ్బుతో నీ పిల్లలకు వైద్యం చేయించు. నీ అవసరాలు తీర్చుకో. ఒక స్నేహితురాలిగా ఇస్తున్నాను" అన్నది.

తనకి ఏడుపు తన్నుకొని వచ్చింది. ఎంత ఆపుకుందామనుకున్నా సాధ్యం కాలేదు. చివరకు పెద్దగా ఏడ్చింది కూడా.

"ధైర్యంగా ఉండు మేరీ.... జాన్సన్‌కి నీకూ ఈమధ్య సంబంధం ఏర్పడిఉండొచ్చు కానీ మన మధ్య ఎప్పటినుంచో స్నేహబంధం ఉంది. ఒక స్నేహితురాలిగా సాయం చెయ్యలేనప్పుడు నేను నీ స్నేహితురాలిననే ఆలోచనే నా గుండె కోతకు కారణమవుతుంది. సందేహించకు తీసుకో...."

తనకు అంతా కలగా ఉంది. ఇదేమిటి ఇలా జరుగుతోంది. తనేం చేయాలి?

"ప్రిస్కిల్లా ఇంకా ఏమన్నాదో చెబుతాను. ఎంతటి దుర్మార్గుడయినా నీళ్లలో పడి కొట్టుకుపోతున్నప్పుడు అతడిని రక్షించాలిట. ఆ పరిస్థితుల్లో అతడి దుర్మార్గాన్ని చూడకూడదట. మానవత్వంతో అతడి ప్రాణాపాయ స్థితిని చూడాలిట. కొన్ని పరిస్థితులలో కొన్ని రకాల పనులు చెయ్యగూడదన్నది ప్రస్తుతం నువ్వున్న పరిస్థితుల్లో నిన్నింకా బాధపెట్టడం న్యాయం కాదని చెప్పింది. నా దృష్టిలో ప్రిస్కిల్లా గొప్ప వేదాంతి" అన్నది రోజీ.

"రోజీ నన్ను క్షమించు" పూడుకుపోయిన గొంతుతో అన్నది.

"మన మధ్య క్షమాపణలు ఉండవు"

"నీ రుణం ఎలా తీర్చుకోవాలో తెలీటం లేదు"

"నువ్వు తీర్చుకోవాల్సింది నా రుణం కాదు. ప్రిస్కిల్లా రుణం"

వాకిలి దగ్గర నిలబడి ప్రిస్కిల్లా విరగబడి నవ్వుతోంది. ❖